క్లుప్తంగా

రైతులకు శిక్షణ



విడవలూరు: మండలంలోని చౌకచర్ల, గాదెల దిన్నె, తుమ్మగుంట గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఆత్మ సౌజన్యంతో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మి అన్నారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త పరమ శివ, కోవూరు ఏడీఏ అనిత హాజరై, పలు సూచనలు చేశారు. వరిపైరులో కంకి కింద నల్లటి మచ్చలు రావడం గుర్తించి, నివారణ చర్యలు సూచించారు. అదేవిధంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి రైతు పంట నమోదు తప్పకుండా చేసుకోవాలని కోరారు. అనంతరం మండలంలోని పలువురి రైతుల పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏలు చాద్విక, వర్షిత, రాజ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

కోవూరు: ఆర్టీసీ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని వారు రెండో రోజు బుధవారం కోవూరులోని ఆర్టీసీ వర్క్‌షాపు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా ఆర్టీసీ సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చేనేత వృత్తి చేసుకునే వారికి నేత బజారును ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు నగరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాలాజీ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని గాంధీ నగర్‌లో ఆప్కోకు కేటాయించిన స్థలంలో ఇస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో రామనాథం రాజశేఖర్, జానపాటి రామసుబ్బయ్య, సోమా గోపాల్, సోమా అనురాధ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను మెరుగుపరచాలి

నెల్లూరు(టౌన్): రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపరచాలని ది పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు నరహరి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ అధికారుల వైఖరిని ఒకసారి పరిశీలించాలన్నారు. నాలుగో తరగతి ఇంగ్లిష్ ప్రశ్నపత్రం పిల్లలు సమాధానం రాసే స్థాయిలో ఉందా అని ప్రశ్నించారు. టెక్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్‌లో ఉన్న ప్రశ్నలు ఇవ్వకుండా జేఈఈలో ఇచ్చినట్లు అప్లికేషన్ టైపు ప్రశ్నలు ఇస్తున్నారన్నారు. బడుల్లో పూర్తి స్థాయిలో టీచర్లు లేరన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం ఇచ్చే ప్రశ్నపత్రాలను అనుసరించడం లేదన్నారు. విద్యార్థి స్థాయికి తగ్గట్టు ప్రశ్నపత్రం ఎందుకు రూపొందించడం లేదన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శిక్షణ

నెల్లూరు(అర్బన్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వచ్చే నెలలో ఎయిర్ కండీషన్, రిఫ్రిజిరేటర్ సెల్‌ఫోన్‌లకు సంబంధించి సర్వీసింగ్, మరమ్మతులపై పురుషులకు శిక్షణ ఇస్తున్నామని ఆ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.కాశయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్త్రీలకు సంబంధించి టైలరింగ్, మగ్గం వర్క్‌లలో అక్టోబర్ నెలలో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ శిక్షణ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహిస్తామన్నారు. తెలుగు చదవడం, రాయడం వచ్చి.. 18 ఏళ్ల వయసు నిండి 45 ఏళ్ల లోపున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన, వసతి అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 94916 94560, 81860 02249, 98852 11995 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు చేపట్టాలని టీపీఆర్వో వాసుబాబు ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్షను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. అన్ని డివిజన్లలో 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

కొందరి స్వార్థం.. రైతులకు శాపం

- అడుగంటిన కనుపూరు చెరువు
- చేపల కోసం కాలువలకు చెరువు నీటి విడుదల
- ఐదు గ్రామాల్లో తాగునీటి సమస్య
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

చెరువులో ఉన్న చేపలను పట్టుకోవాలనే స్వార్థం.. ఇరిగేషన్ అధికారుల పట్టింపు లేకపోవడం వెరసి మండలంలో పది గ్రామాలకు పైగా తాగునీరు, సాగునీరు అందించే ప్రధానమైన కనుపూరు చెరువు ప్రస్తుతం అడుగంటి ఎండిపోయే స్థితికి చేరింది. చేపలు పట్టుకునేందుకు చెరువులో ఉన్న నీటినంతా కాలువలకు వృథాగా వదిలేయడంతో కనుపూరు చెరువు పరిధిలోని గ్రామాల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మూడు నెలలుగా నీరు లేకపోవడంతో పచ్చని పొలాలుగా కనిపిస్తున్న కనుపూరు చెరువు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్ తర్వాత సాగునీరు, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత కలిగిన కనుపూరు చెరువు ప్రస్తుతం దీనస్థితికి చేరుకుంది. ఈ చెరువులో నీరు పుష్కలంగా ఉంటే మండలంలోని వెంకటాచలం, కనుపూరు, కందలపాడు, చవటపాళెం, తిక్కవరప్పాడు, కంటేపల్లి, కాకుటూరు తదితర గ్రామాల్లోని బావులు అడుగంటకుండా ఉంటుంది. దీంతో ఆయా గ్రామాల్లో ఎటువంటి సాగునీటి సమస్య రాదు. అయితే చెరువులో లక్షలాది రూపాయల విలువ చేసే చేపలు, రొయ్యలు ఉండటంతో కనుపూరు చెరువు చేపల సొసైటీ నిర్వాహకులు ఆ నీటిని కాలువలకు వదిలేసి చేపలు పట్టేందుకు పూనుకున్నారు. అయితే చెరువు నీటిని కాలువలకు వదిలేస్తే రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని ఆలోచించారు. కొందరు టీడీపీ నాయకులు అండ చూసుకుని చెరువు నీటిని కాలువల ద్వారా వృథాగా వదిలేశారు.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కనుపూరు చెరువు నీటిని కాలువలకు వదిలేయడంతో మండలంలోని వెంకటాచలం, కనుపూరు, చవటపాళెం గ్రామాల రైతులు చేపల సొసైటీ నిర్వాహకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని రైతులు మండిపడుతున్నారు. గత మూడు నెలల నుంచి చెరువులో నీరు లేని కారణంగా గ్రామాల్లోని నేలబావులు, బోరు బావుల్లో నీరు అడుగంటిపోయి, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సోమశిల జలాలను అడుగంటిపోయిన చెరువులను గుర్తించి విడుదల చేస్తున్నారు. మండల పరిధిలో కనుపూరు కెనాల్ పరిధిలో ఉన్న చెరువుల్లో దాదాపు అన్నింటికీ నీరు విడుదల చేసినా కనుపూరు చెరువుకు మాత్రం నీరు విడుదల చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేవలం చేపల సొసైటీ నిర్వాహకులకు ప్రయోజనం చేకూర్చేదాని కోసం కనుపూరు చెరువును ఎండబెట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. మరో రెండు నెలల్లో కనుపూరు చెరువు ఆయకట్టు పొలాల్లో నారుముళ్లు పోసేందుకు రైతులు సిద్ధమవుతారు. ప్రస్తుతం చెరువులో సక్రమంగా నీరు లేకపోవడం, వర్షాలు కురవకపోతే పరిస్థితి ఎలాగని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో సగానికిపైగా ఉన్న నీటిని కాలువలకు వృథాగా వదిలేయకుంటే తాగునీరు, సాగునీటికి ఎలాంటి సమస్య ఉండేది కాదని రైతులు వాపోతున్నారు. తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో రాకముందే కనుపూరు చెరువుకు నీరు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో కాకాణి పూజిత పర్యటన

పొదలకూరు: మండలంలోని పొదలకూరు, నావూరుపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత బుధవారం పర్యటించారు. పట్టణంలోని కాకాణి రమణారెడ్డి నగర్‌లో సర్వేపల్లి నియోజకవర్గ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు పి.శకుంతలమ్మ మనుమడు సాయితేజ వివాహానికి హాజరై ఆశీర్వదించారు. నావూరుపల్లి గ్రామానికి చెందిన కాకు పెంచలయ్య కుమార్తె వివాహ వేడుకలకు హాజరయ్యారు. పూజిత వెంట జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, పార్టీ నాయకులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, అంజాద్, నావూరుపల్లి సర్పంచ్ గాలం వెంగయ్య, సీహెచ్ రమేష్ తదితరులు ఉన్నారు.



పొదలకూరులో వివాహ వేడుకకు హాజరైన పూజిత

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

కోవూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని, దీనిపై క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీల శాతం పెంచేందుకు కృషి చేయాలని, దీనిపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా కూలీలకు పనుల కేటాయింపులో ఆలస్యం చేయరాదన్నారు. వేతనాల చెల్లింపులు నిర్దేశిత సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ సాధిక్‌తో పాటు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి

సర్వేపల్లిని మరో జిల్లాలో కలపొద్దు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గాన్ని మరో జిల్లాలో కలపొద్దని జిల్లాల పునర్విభజనపై ఏర్పడిన మంత్రివర్గ ఉప సంఘానికి స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం లేఖ రాశారు. సర్వేపల్లిని నెల్లూరులోనే ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరిగింది. అప్పట్లో సర్వేపల్లిని తిరుపతి జిల్లాలో మొదట కలిపి దాదాపుగా ఖరారు చేశారు. అప్పటి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడి సర్వేపల్లిని నెల్లూరులో ఉండేలా కృషి చేశారు. దీంతో అప్పట్లో కాకాణికి పెద్ద ఎత్తున సర్వేపల్లి ప్రజలు నీరాజనాలు పలికారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

వెంకటాచలం: అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ వెంకటాచలం మండలం చెముడుగుంట గ్రామానికి చెందిన రక్షిత అనే మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త భానుతేజ, కుటుంబసభ్యులు శ్రీహరి, జ్యోతి, పూజిత గత కొన్ని రోజులుగా తనను అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా పిడూరు రోడ్డు



ప్రమాదకరంగా మారిన పిడూరు రోడ్డుపై వాహనచోదకుడి పాట్లు

మనుబోలు: చిన్న వర్షానికే మనుబోలు నుంచి పిడూరు వెళ్లే తారురోడ్డు అధ్వానంగా మారింది. బుధవారం తేలికపాటి వర్షం కురిసింది. అసలే గతుకులమయంగా ఉన్న రోడ్డు వర్షపు నీరు చేరి గుంతలు తేలి వాహనదారులు, పాదచారులకు నరకం కనిపించింది. బండేపల్లి రోడ్డు కూడా పలుచోట్ల గుంతలమయంగా మారింది. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మనుబోలు: కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ మండలాధ్యక్షుడు వాసిరెడ్డి రామిరెడ్డి తెలిపారు. మనుబోలులోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో పార్టీ జెండాను నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి వాటిని అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు బోలా శ్రీనివాసులు, మండల నాయకులు ఒలిపి శ్రీనివాసులు, వెంకటకృష్ణారెడ్డి, రాజశేఖర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

నెల్లూరు(బారకాసు): వర్షాల నేపథ్యంలో రోడ్లపై నీరు చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ వైఓ నందన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎన్టీఆర్ నగర్, బాలాజీ నగర్, ఏసీ నగర్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, విజయమహల్ గేటు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలువలను మూసివేస్తూ చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన కమిషనర్ వెంటనే వాటిని తొలగించి పూడికతీతకు అడ్డంకి లేకుండా చూడాలని ఆదేశించారు. అండర్ బ్రిడ్జీల వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా మోటార్ల సాయంతో తోడాలన్నారు. అధికారులు రామ్‌మోహన్‌రావు, హిమబిందు, ఈఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

⇒ నక్ష సర్వే నిర్వహణపై సమీక్షను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నందన్ నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై వేగంగా స్పందించాలి

- రిటైర్డ్ జడ్జి, చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి



విద్యుత్ అదాలత్‌లో వినతిపత్రం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

పొదలకూరు: విద్యుత్ సరఫరాలో రైతులు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడమని, దీనిపై రైతులు, పోలీసులు వేగంగా స్పందించాలని విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాసఆంజనేయమూర్తి అన్నారు. పొదలకూరు సబ్‌స్టేషన్‌లో నెల్లూరు రూరల్, పొదలకూరు, ముత్తుకూరు, రాపూరు సబ్ డివిజన్లకు సంబంధించి విద్యుత్ అదాలత్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకు గురైన వెంటనే సంబంధిత ఏఈలకు రైతులు సమాచారం అందివ్వాలన్నారు. ఏఈలు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. అయితే స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంటనే కేసులు నమోదు చేయకపోవడం వల్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేకపోతున్నట్టు చెప్పారు. ఇందువల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నారు. కొందరు రైతులు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన ఏడాదికో, రెండేళ్లకో సమాచారం చెబుతుంటారని, దాని వల్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. విద్యుత్ అదాలత్‌లో ప్రధానంగా ఫ్యూజులు పోవడం, విద్యుత్ తీగల రిపేర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, విద్యుత్ నిలిపివేతకు కాలపరిమితి తదితర సమస్యలపై వినియోగదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అయితే నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో నిర్వహించిన అదాలత్‌కు కేవలం 15 అర్జీలు మాత్రమే అందాయి. ఇందులో ప్రధానంగా పొదలకూరు పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల వినియోగదారులే హాజరై వినతులను అందజేశారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో బంజర్ కేబుల్ మార్చాలని కేబుల్ పురాతన కాలంలో వేయడం వల్ల లో-ఓల్టేజీ సమస్య ఉందని అర్జీ అందజేశారు. సోలార్ మీటర్లలో తేడా ఉందని, బిల్లులు అధికంగా వస్తున్నాయని కూడా వినతిపత్రం అందజేశారు. అదాలత్‌లో ఫైనాన్స్ మెంబర్ జి.మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఎస్ఈ విజయన్, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈ సుబ్రహ్మణ్యం, ఏఈలు పాల్గొన్నారు.

వైద్యసేవల ధరలను ప్రదర్శించాలి

కొడవలూరు: ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవల ధరలను బోర్డులపై బహిరంగంగా ప్రదర్శించాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న ప్రశాంతి నర్సింగ్ హోమ్, ప్రజా వైద్యశాల, దీప్తి నర్సింగ్ హోమ్‌లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు, వైద్యసేవలకు తీసుకొంటున్న ధరలు, వైద్యుల అర్హత, వైద్యశాల అనుమతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి వైద్యశాల తప్పనిసరిగా అన్ని అనుమతులు కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారైతే నిర్దేశించిన గడువులో విధిగా రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. నార్తురాజుపాళెంలో పలు ప్రైవేట్ ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ లేదని, ఇప్పటికే వాటి వివరాలను గుర్తించి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపినట్లు వివరించారు. వీరంతా వెంటనే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వైద్యాధికారి వెంట హెచ్‌ఏ ఎస్కే షఫీఉద్దీన్ ఉన్నారు.



నార్తురాజుపాళెం ప్రశాంతి నర్సింగ్ హోమ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

కోవూరు: కోవూరు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 వై.చెంచులక్ష్మమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో జరుగుతున్న బోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు విద్యతో పాటు ఆటపాటల ద్వారా సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పక పాటించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారానికి కనీసం ఒకసారి పాఠశాలను సందర్శించి పిల్లల చదువు, ఆహార నాణ్యత పరిశీలన చేపట్టాలని కోరారు. భోజన సరఫరా చేసే ఏజెన్సీకి కూడా మెరుగైన ఆహార పదార్థాల వినియోగంపై పలు సూచనలు చేశారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూల ధరలు పైపైకి..

- శ్రావణ మాసం ఎఫెక్ట్
- పూజలు, గృహ ప్రవేశాలు కూడా..
- కార్తీక మాసం వరకు ఇదే పరిస్థితి

పూలంటే మహిళలకు మహా ప్రీతి. ఒక్కో దేవుడిని ఒక్కో రకం పూలతో కూడా భక్తులు అభిషేకిస్తుంటారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు ఇతర పూజా కార్యక్రమాలకు వివిధ రకాల పూలు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో శ్రావణ మాసం నుంచి పెళ్లిళ్ల ప్రారంభం అయిన నేపథ్యంలో పూల ధరలు అదిరిపోతున్నాయి.



మర్రిపల్లి వద్ద పాలిహౌస్‌లో చామంతి సాగు (ఫైల్)

పొదలకూరు: జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఒక మోస్తరు ధరలు ఉండగా, మండల కేంద్రాల్లో ధరలు అమాంతం పెంచేసి అమ్ముతున్నారు. పూల ధరలపై ఆంక్షలు లేకపోవడంతో ఎవరి ఇష్టం మేరకు వారు పెంచేసి విక్రయిస్తున్నారు. పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో పూల దుకాణాలు చాలానే ఉన్నాయి. ఇక్కడ ప్రతి నిత్యం వ్యాపారులు పోటీపడి అమ్మకాలు సాగిస్తుంటారు. విడిపూలు, మాలలు అమ్మడంతో పాటు కొందరు ప్రత్యేక కార్యక్రమాలకు పూలాలంకరణలకు కూడా వెళ్తుంటారు. వివాహాల్లో పూల డెకరేషన్‌కు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఈ అలంకరణకు మండపాల యజమానులు రూ.లక్షల్లో చార్జ్ చేస్తుంటారు. ఫలితంగా పూల ధరలు పైపైకి చేరుకుంటున్నాయి. ఇదేమాసంలో వినాయక చవితి, సెప్టెంబర్‌లో విజయదశమి, దీపావళి పండగలు, నవంబర్ ప్రారంభంలో కార్తీక మాసం ఉండడం వల్ల పూలకు బాగా డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా ఇప్పట్లో పూల ధరలు దిగిరావని భావిస్తున్నారు. అయితే మల్లెపూల ధరలు షాక్ కొడుతున్నాయి. కాగా గులాబి పూలే తక్కువగా లభ్యం అవుతున్నాయి.

జిల్లాలో తగ్గిన పూలసాగు

సాధారణంగా పూలసాగు చిన్న కమతాల్లోనే రైతులు చేస్తుంటారు. ఎకరాలకు ఎకరాల్లో పూల సాగు చేసే రైతులు పెద్దగా ఉండరు. తూర్పు పల్లెల్లో ఓ మోస్తరుగా పూల సాగు ఉంది. మెట్ట ప్రాంత గ్రామాల్లో పూల సాగు చాలా తక్కువగా ఉంది. పందిళ్లు, పూల మొక్కల రక్షణ కోసం పాలీ హౌస్‌ల నిర్మాణ వ్యయంతో కూడుకున్న పని కావడంతో రైతులు పూలసాగుపై ఆసక్తి చూపరు. పూలతోటల పెంపకం ఉద్యాన పంటల కిందకు వస్తున్నందున ఆ శాఖ వారు సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీలను కూడా కల్పిస్తోంది. ఒక హెక్టారులో పూల సాగు చేస్తే ఉద్యానశాఖ నుంచి రూ.16 వేల సబ్సిడీ లభిస్తోంది. అయితే చెన్నై, బెంగళూరుల నుంచి పూలు దిగుమతి అవుతున్న నేపథ్యంలో సీజన్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మండలంలోని నల్లపాళెం, తాటిపర్తి, మర్రిపల్లి, మొగళ్లూరు తదితర గ్రామీణ ప్రాంతాల్లో పూలసాగు ఉంది. ఇక్కడ చామంతి, సంపంగిని సాగు చేస్తున్నారు. మర్రిపల్లిలో రైతు ఇటీవల పాలిహౌస్(పూలతోట)ను తొలగించారు.

ధరలిలా.. (కిలో)	
చామంతి	రూ.350
బంతిపూలు	రూ. 80
రోజాపూలు	రూ. 80
మల్లెపూలు	రూ.550
కనకాంబరం	రూ.400
సంపంగి	రూ.150
కలువ పూలు	రూ.700
తామరపువ్వు	రూ.15



పూలతో అలంకరించిన మండపం



పొదలకూరులోని పూల దుకాణాలు



వివిధ రకాల పూలమాలలు